
శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తాస్వామి

# శ్రమతో సేవ - సేవతో కైవల్యం

వ్యవస్థాపకులు: శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ ఎడిటర్ : గొర్తి సాయి సుబ్రహ్మణ్యం

శ్రీ సుబ్బరామయ్య సార్ జీవిత విధానం ద్వారా బోధించిన "శ్రమతో సేవ - సేవతో కైవల్యం" ను అనుసరించి మా జన్మలు ధన్యం గావించుటకు ఈ మాసపత్రికను ప్రారంభిస్తున్నాము. శ్రీ సుబ్బరామయ్య సార్ మనకందించిన అనుభవాలను, సాంగత్య స్మృతులను, సార్ ఆచరించి బోధించిన అమూల్య విషయాలను స్మరించుకొనుటకు, మహాత్ములు బోధించిన సత్సంగ, సద్గ్రంథ పఠనలకు ప్రేరణగా ఈ మా చిన్న సేవ.
గమనిక : ఎవరైనా ఈ మాగజైన్ లో తమ వ్యాసాలను, అనుభవాలను పంచుకోదలిచినవారు saimaster.sevatrust@gmail.com కు e-mail చేయగలరు

సంపుటి : 04
సంచిక : 02

**నేపథ్యం : సబూరి**
**సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహారాజ్ జయంతి సంచిక**

ఆషాఢ పౌర్ణమి
తేదీ :03 ఆగస్టు 2020

| | |
|---|---|
| శ్రీ సుబ్బరామయ్య సార్ ప్రవచనం | శ్రీ సార్ ఈ సత్సంగంలో సబూరి యొక్క మరియొక అర్థం తెలుపుతూ సమయపాలన - ప్రాముఖ్యము శ్రీ స్వామి నిరంతర స్మరణ తో కలిగే అనుభవాలు అందిస్తున్నారు.<br>http://saimastersevatrust.org/Speeches/Saburi_Samayapalana.mp3<br>http://saimastersevatrust.org/Speeches/SamayaPalana_SwamiBodha.mp3 |

నరస్యాభరణం రూపం - రూపస్యాభరణం గుణం |
గుణస్యాభరణం జ్ఞానం - జ్ఞానస్యాభరణం క్షమా ||

భగవంతుని అజ్ఞ ప్రకారం జరుగుతున్న లాక్ డౌన్ వలన మిగిలిన రాష్ట్రాల నుండి భక్తులు సార్ సమాధి దగ్గరకు వెళ్లలేక పోతున్నారని సుబ్బరామయ్య సార్ ఈ సారి అందరి భక్తుల ఇళ్లకు అంతేగాక వారి హృదయాలలోకి జొరబడి జయంతి ఉత్సవాలలో (జూలై 15వ తేదీ న) అందరినీ ప్రతి క్షణం తమ స్మరణ చేయించి పునీతులను చేసి ఆనంద డోలికలలో ముంచెత్తారు. సార్ దగ్గరకి రాలేని భక్తులందరూ ఆన్లైన్ లో సార్ సమాధిని దర్శించి ఆనందించారు.




శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ ఢగ్గాస్వామి

# సంపాదకీయం : నిష్ఠ - సబూరి

Audio: Nishta_Saburi

ఓం

## కష్టాలలో ఓరిమి : కర్తవ్యనిష్ఠకు, కార్యశూరత్వానికి నాంది

శ్రీ సుబ్బరామయ్య సార్ అనేకమందికి "కష్టముల యందు ధైర్యము" అని చెప్పేవారు. కష్టముల యందు ధైర్యముతో కూడిన ఓరిమి వహించమని ఉద్బోధ.

మనకు ఇష్టం లేని పరిస్థితి గాని, కష్టం కలిగించే పరిస్థితి గాని కలిగినప్పుడు మనకు అసంతృప్తి కలిగి అది చిరాకు, నిట్టూర్పు, అసహనంగా ప్రకటమవుతుంది. ఇందుకు కారణమేమి? అనాలోచితం గానే కొన్నింటిని కష్టాలని, సుఖాలని తలుస్తాము. ఇది నిజంకాదు అని శ్రీ మాస్టారు సాయి ప్రభోధముతంలో వివరిస్తారు. అంటే కష్ట -సుఖాల అవగాహన లేక పోవటం వల్లనే అసంతృప్తి, అసహనం అని తెలుపుతారు.

"శ్రీ మాస్టారుబోధామృతం" లో శ్రీ సార్, మాష్టారి లేఖ ద్వారా మనం కష్టంగా భావించే సందర్భాలలో గుర్తుంచుకోవలసిన ముఖ్య సూచన ఇలా తెలుపుతారు. ఆ సందర్భాలలో మన శ్రమ, ప్రయత్నంతో "మనం ప్రయత్నించవలసిన కర్మ నిర్మూలించుకొనుట కొరకే కానీ, మన ప్రయత్నంతోనే అన్నీ జరుగుతాయని కాదు. నిజానికి మన యత్న ఫలితాలు పూర్వ కర్మ పై ఆధారపడతాయి" అని చెబుతారు. ఈ రకమైన వివేకం మనకు అసహనం నుండి బయట పడడానికి, సరైన అవగాహనను కలిగించి కార్య విముఖులం గాకుండా కర్తవ్య నిష్ఠ వహించడానికి సహాయపడుతుంది.

శ్రీ మాష్టారు కష్టకాలంలో ఎలా జీవించినది, "సాయి ప్రబోధామృతం" మానవాళికి ఎలా అందించినది శ్రీ సార్ ఇలా చెబుతారు.

మాస్టారు గారు విద్యానగర్ నుండి ఒంగోలు వచ్చేటప్పటికీ ద్వారక పురిటి బిడ్డ. శ్రీ మాస్టారు, అమ్మగారు ఉండేందుకు సరైన ఇల్లు కూడా దొరకని కారణంగా ఒక శిధిలమైన ఇంట్లో ఉండవలసి వచ్చింది. ప్రెస్ కూడా అప్పుడే మొదలైన కారణంగా ఇంట్లో తినడానికి సైతం ఏ రోజుకా రోజు రావాల్సిందే. ఇట్టి కష్టకాలంలో దైవాన్ని, తనను, ఇతరులను నిందించుకుంటూ అసంతృప్తితో కాలం గడిపి వేయక శ్రీ సాయినాధుని చరిత్ర సంఘటనలను, బోధలను మధించి “శ్రీ సాయి ప్రబోధామృతం” అనే అమృతాన్ని మనకందరికీ అందించారని” చెబుతారు.

అలానే శ్రీ సార్ B.Ed. అయ్యాక కూడా Teaching post వెంటనే రానప్పుడు వారి అమ్మగారి కష్టార్జితం తింటూ వారికి భారంగా ఉండడం ఇష్టం లేక, రైల్వే గ్యాంగ్ కూలి పనికి వెళ్లడానికి సిద్ధపడ్డారు. టీచర్ జాబ్ వచ్చేవరకూ శ్రమించారు. శ్రీ సార్ కు ప్రాణాంతకమైన ఆయాసం నుండి బయటపడటంలో శ్రీ స్వామి వారి ఆదేశానుసారం స్వపాకం, ఉప్పు, పులుపు, కారం, నూనె లేని ఆహారనియమం కఠోర నియమ పాలన చేస్తూనే స్వామి సేవలో జీవించారు. స్వామి పై ఎన్నో రచనలను మనందరికీ అందించారు. వీరిద్దరి ఆచరణ కష్టాలలో ఓరిమి అవగాహన కలిగి వ్యవహరిస్తే, క్రియా శూరత్వంతో భగవంతుని మెప్పించవచ్చు అని తెలుపుతుంది.


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తాస్వామి

## ఓరిమి నిలుపుకోలేక పోవుటకు కారణం - అందువల్ల అనర్థం ?

శ్రీ మాస్టారు ప్రబోధామృతం లో మనకు ఇష్టమైన వారు బండెడు సామాను ఇంట్లో ఉంచినా మనకు ఇబ్బంది ఉండదని, అదే ఇష్టం లేని వారు ఒక చిన్న బ్యాగ్ పెట్టుకుంటామన్నా కష్టంగా ఉంటుందని గుర్తు చేస్తారు.

ఎప్పుడు ఓరిమి వహించలేము అని గుర్తిస్తే, వ్యక్తుల యందు మన ఇష్టాయిష్టాల వల్ల, పరిస్థితులయందు రాగద్వేషాలను అనుసరించి కూడా ఓరిమి వహించడం ఉంటుందని గుర్తించగలం. అయిష్టమైన పరిస్థితి, వ్యక్తి పట్ల ఓరిమి కోల్పోవడం మనకందరికీ అనుభవమే. అట్లే మనం ద్వేషం వహించే వ్యక్తిపట్ల, మన అభిప్రాయానికి భిన్నంగా ఉన్న పరిస్థితి పట్ల కూడా ఓరిమి కోల్పోవడం ఎన్నోసార్లు గమనిస్తూ ఉంటాము.

ఇష్టాయిష్టాలతో చిక్కి మనం ఓరిమిని వీడితే ఆ పరిస్థితి ఎంతటి అనర్థానికి దారితీస్తుందో ముకుంద బ్రహ్మచారి సంఘటనలో శ్రీ మాస్టారు వివరిస్తారు. "భారతదేశంలో ముస్లిం మతం అంతరించాలి" అని తపస్సు చేస్తున్న ముకుంద బ్రహ్మచారికి, భగవంతుడు సందేశం ముస్లిం వేషధారి అయిన శ్రీ సాయినాధునితో పంపుతారు. ముకుంద బ్రహ్మచారి బాబా వేషాన్ని చూడగానే తన ఇష్టాయిష్టాలకు- అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇచ్చి ఆత్మహత్య చేసుకుంటానన్నారు. అందువల్ల వారి సంకల్పం కూడా నెరవేరకుండడం చూడవచ్చు. అట్లే మన రాగద్వేషాల వల్ల కూడా ఓరిమిని నిలుపుకోలేమని, నిష్ఠ వహించలేమని చెన్నబసవప్ప-వీరభద్రప్పల అనుభవం నిరూపిస్తోంది. శ్రీ సాయినాధుని గౌరీ, చెన్నబసప్ప ఆశ్రయించినా బాబాపై నిష్ఠతో, ఓరిమిని నిలుపుకో లేకుండటం వల్ల చెన్నబసప్ప కప్ప వంటి హీన జన్మను పొందాడు. సద్గురువును









ఆశ్రయించినా ఓరిమినీ, నిష్ఠను వీడితే మనం పొందగల అధోగతిని ఈ సంఘటనలు తెలుపుతాయి.

## ఓరిమి (సబూరి) విడవకుండా ఉండటం ఎలా?

సాయిలీలామృతంలో సబూరిని "సర్వ సద్గుణాలకు నిధి" అని కీర్తించారు. అట్టి ఓరిమి (సబూరి) ని విడవకుండా ఉండటం ఎలా? శ్రీ మాస్టారు గారే దానికి మార్గం తెలుపుతూ "నిష్ఠ సబూరిలు అక్కాచెల్లెళ్ల వంటివి... ఒక దాని సహాయంతో మరొకటి నిలుస్తాయి" అని చెబుతారు. నిష్ఠ అంటే అన్ని జీవులలో మన సద్గురువే ఉన్నారు. మన ప్రస్తుత పరిస్థితులు, ప్రక్కన ఉన్న వ్యక్తులు మొదలైనవన్నీ ఋణానుబంధాన్ని అనుసరించి ఆ విశ్వగురుడు ఏర్పరచినవే. శ్రీ సారు చెప్పినట్లు వారే "సర్వ ప్రేరణ అధికారి", "విశ్వ ప్రేరణ అధికారి", "ఆదిలో అపరాధము ఎవరిది", సర్వదా పరివేష్టించి అన్నింటినీ నియమించి నడుపుతున్నారు. మన లోపల కూడా ఉండి సాక్షిగా గుర్తిస్తూ "మత్తస్స్మృతిరిజ్ఞాన మపోహనంచ" గా కూడా వ్యక్తమవుతున్నారు. ఈ గుర్తు నిరంతరం నిలుపుకోవడమే నిష్ఠ అంటారు.

మిలారెపా చరిత్ర ముందుమాటలో వివరించినట్లు "సర్వగతుడైన భగవంతుని పై మనసు నిలిపి, నిరంతరం గుర్తుంచుకుని, ఆయనకు తృప్తికరమైన రీతిన మనలను మలచుకోవడమే, ఆయన కృపకు పాత్రులం అయ్యేటట్లు నడుచుకోవడమే" నిష్ఠ అని గుర్తించగలము. ఇట్టి నిష్ఠను కూడా పెంపొందించు కొంటూ ఉండటమే - ఓరిమిని నిలుపుకోగల మార్గము అని వీరి బోధలు తెలుపుతున్నాయి.


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ ఢగ్గాస్వామి

## నిరంతర స్మరణ ఎలా సాధ్యం ?

ఈ నిష్ఠ-ఓరిమిల ప్రాధాన్యతను హృదయగతం చేసుకొని నిలుపుకో ప్రయత్నిస్తుంటే, రాగద్వేషాల బారి నుండి, ఓరిమి నిలుపుకో సాధ్యమవుతుంది. ఇబ్బందికరమైన లేదా కష్టతరమైన పరిస్థితుల్లో ఓరిని నిలుపుకుంటే అసహనానికి గురి కాకుండా నిష్ఠను కూడా కోల్పోకుండా ఉండగలుగుతాము, అని శ్రీ మాష్టారి ప్రవచనాలలో తెలుపుతారు.

శ్రీ మాస్టారు, శ్రీ సార్ జీవన సంఘటనలు ఎన్నో ఇట్టి నిష్ట-ఓరిమిలతో నిరంతర స్మరణను చేరుకోగలుగుతామని తెలుపుతున్నాయి. ఉదా : శ్రీ మాస్టారి పై ఎన్నో అపవాదులు వేసి ఒక పత్రికలో ప్రచురించినా, శ్రీ మాస్టారు ప్రతీకారానికి ఆలోచించక పోవడం, వారు ఓరిమిని వీడక పోవడాన్ని తెలుపుతుంది. అట్లే చెప్పుడు మాటల ప్రాబల్యంతో ధనుంజయ్ కత్తి పట్టుకుని వచ్చినా, శ్రీ మాస్టారు భయము, ద్వేషము వహించక, అతనిలో బాబాను దర్శిస్తూ "ఏమి ధనంజయ!" అని పలకరించడం, నిష్ఠలో నెలకొని ఉన్న మాస్టారిని చూపుతుంది. "కత్తిగాటు వలన నా మరణం ఉంటే మేకు గుచ్చుకొని అయినా నా ప్రాణం కోల్పోతాను" అన్న అవగాహన, ఎదుటి వ్యక్తులో, జరిగే సందర్భంలో సాయినాధుని నిరంతరం గుర్తించటం శ్రీ మాస్టర్ లో నెలకొని ఉన్న నిష్ఠను తెలుపుతుంది.

అట్లే శ్రీ సార్ ను గిట్టనివారు చంపుదామనుకున్న విషయం తెలిసినా శ్రీ స్వామి ఆదేశమైతే ఎక్కడి కెళ్ళినా మరణం తప్పదని సార్ గొలగమూడి వదలలేదు. ధ్యానం చేస్తూ కళ్ళు తెరువగానే పాము ఎదురుగా పటాల ముందు ఉన్నా అందులో సాయిని దర్శించి సార్


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దగ్గాస్వామి

నిర్లిప్తంగా ఉంన్నారు. శ్రీ సార్ సాధించిన నిష్ఠ-సబూరి లను ఈ సంఘటనలు తెలుపుతున్నాయి.

శ్రీ మాస్టారు సాయిలీలామృతం లో వివరించినట్లు “సబూరి సర్వ సద్గుణాలకు నిధి. విశ్వాసానికి సోదరి. కష్టాలను అన్నింటినీ తొలగించి విజయాన్ని ప్రసాదిస్తుంది” అన్నది ఈ పై సంఘటనల లోనే కాక, ఎందరో భక్తుల కష్ట గాథలలో ప్రతిబింబిస్తుంది.

## సంపూర్ణ శరణాగతి - కష్టాలు అనుగ్రహానికి గుర్తు :

ఓరిమితో కర్మఫలాలను, కష్టాలను అనుభవిస్తూనే, నిష్ఠతో శ్రీ గురునీ, దైవాన్ని, వారు ఆదేశించిన జీవన విధానాన్ని వీడని వారికి “కష్టాలు అనుగ్రహానికి గుర్తు” అన్నది నిరూపణ అయి, శ్రీ సార్ వివరించు రీతి భగవత్ ప్రసాదంగా తృప్తి-శాంతి లభించడం చూడవచ్చు. వారి సాంగత్యంలోకి వచ్చిన వారికి అందరికీ కూడా తృప్తి-శాంతి కలిగించగలగడం చూడవచ్చు. ఈ రకమైన అవగాహనతో నిరంతర స్మరణ సాధించటానే శ్రీ మాస్టారు, శ్రీ సార్ “సంపూర్ణ శరణాగతి” అని వ్యవహరించడం చూడవచ్చు.

“గురువు పై ప్రతి చిన్న విషయానికి ఆధారపడటమే అసలైన సాధన”, “మరుపే మరణం”, “ధ్యాస లేకుండా గడిపిన క్షణాల లోని, మనో వికారాలు జన్మ పరంపరలను ప్రేనే తాళ్లని గుర్తించి త్యజించు”, “అల్లా మాలిక్” మొదలగు అన్ని మహా వాక్యాలలో ఈ గుర్తు నిరంతరం నిలుపుకుంటూ, మన మానవ సహజమైన బలహీనతల పట్ల, పరిస్థితుల, వ్యక్తులవల్ల వ్యక్తమయ్యే రాగద్వేషాలుపట్ల ఓరిమితో వ్యవహరించే మెలుకువ చెబుతారు. అట్టి నిరంతర ఎరుకతో జీవనం సాధించడమే సంపూర్ణ


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దగ్గాస్వామి

శరణాగతి మార్గము అని శ్రీ మాస్టారు, శ్రీ సార్ ఆచరించిన జీవిత విధానం, బోధ. అట్టి నిష్టా- సబూరిల తో కూడిన జీవిత విధానాన్ని సాధించిన వారే "సిద్ధ్య సిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే" అన్న యోగ జీవితంలో నెలకొని ఉంటారని వారి ఆచరణ తెలుపుతోంది. అటువంటి మార్గంలో నడిపించమని శ్రీ మాస్టారు-సార్ లను ప్రార్థిస్తూ -సాయి

## భక్తుల అనుభవాలు

శ్రీ శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జై

**నిత్యసత్యులు - ఎవరికి ఏమి చేసినా ఎలా చేసినా భగవంతునికే చెందుతుంది** Audio

సాయిశివ ఇలా చెపుతున్నాడు: తన చిన్నప్పుడు శ్రద్ధ లేదు, సరిగ్గా చదువుకో లేదు. 25 మార్కులు కి ఏడు ఎనిమిది మార్కులు దాటితే చాలా గొప్ప అన్నమాట. అలా ఉన్న పరిస్థితి నుంచి సారు ఎంత ట్రాన్స్ఫర్మేషన్ తీసుకొచ్చారంటే చెప్పలేము. సార్ నిత్య సత్యులు అంటే సమాధి అనంతరం కొన్ని రోజులు ఉండి తర్వాత వదిలివేయటం కాదు కదా! ఎన్ని జన్మలైనా ఎప్పుడూ మనకు తోడుగా ఉంటూ మనల్ని నడిపించే వాళ్ళని నిత్యసత్యులు అంటారు, లేకపోతే అందరూ నిత్య సత్యులు అవరు కదా!

సార్ తో పరిచయం కాకముందు ఒక రకంగా, పరిచయం అయినప్పుడు ఒక విధంగా వివిధ మహాత్ముల రూపంలో చెప్పటం, కరెక్ట్ గా వేరువేరు రూపాలలో అనుక్షణం భగవంతుడు నడిపిస్తున్నారు. సార్ దగ్గరికి వచ్చేదాకా చదువు మీద శ్రద్ధ మాత్రం లేదు ఇది చదవాలి, ఇది సేవ దీని ద్వారా ఆయన సేవ ఇలా చేయాలి అనేది లేదు. **మనము భగవంతునికి సాధన అనుకున్నా, పారాయణ అనుకున్నా, పూజ అనుకున్నా ఆయన**

**ఇచ్చిన పనిని, కర్తవ్యాన్ని సరిగ్గా నిర్వహించకుండా ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోకుండా వేరే ఎంత చేసినా ఆయన ఆక్సెప్ట్ (ఆంగీకరించరు) చెయ్యరు అని కొట్టొచ్చినట్లు చెప్పింది సారే!**

అంతేకాకుండా కావలసిన మార్పులు సార్ తెప్పించారు.

ఐఐటి ఎంట్రన్స్ లో నేను క్వాలిఫై అవ్వలేదు. నాకు ఐఐటీలో చేయాలని చెప్పి మనసులో బలంగా ఉంది. ఎంసెట్లో 5776 ర్యాంకు వచ్చింది అందువల్ల మంచి కాలేజీలో ఇంజనీరింగ్ సీటు రాదు అప్పటికి నా మనసులో వచ్చే సంవత్సరం ఐఐటి ఎంట్రెన్స్ టెస్ట్ లో బాగా వ్రాసి ఐఐటీలో ఇంజనీరింగ్ చేద్దాం అని ఉంది. కానీ నా మామయ్యకు భగవంతుడు ప్రేరణ పెట్టి నాతో 'నువ్వు ప్రస్తుతానికి ఇంజనీరింగ్ కాలేజీలో చేరు. ఎందువలన అంటే నీకు మంచి గ్రూపులో (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్) సీటు, కాలేజీ కూడా దమ్మపేటకు దగ్గరగా పాల్వంచలో వచ్చింది. నువ్వు చేరిన తర్వాత ఐఐటీకి ప్రిపేర్ అవ్వు. మంచి సీట్ వస్తే అప్పుడు వెళ్ళవచ్చు. ప్రస్తుతానికి ఈ కాలేజీలో చేరు' అని ప్రోత్సహించి నన్ను కన్విన్స్ చేసి చేర్పించారు. శివకి ఎంత మాత్రము ఇంజనీరింగ్ కోర్సు కంటిన్యూ చేద్దామనే ఆలోచన లేదు. శివ వాళ్ళ నాన్నగారు శివకు ఇంజనీరింగ్లో సీటు వస్తే వెంకయ్య స్వామి దర్శనం చేసుకుని, మూడు నిద్రలు చేస్తామని మొక్కుకున్నారు. అలానే సీటు వచ్చిన తర్వాత శివని తీసుకుని గొలగమూడికి వచ్చి మూడు నిద్రలు చేశారు. శివ వెంకయ్య స్వామి దర్శనం చేసుకుని 'స్వామీ! సార్ రూపంలో నేను ఏమి చేయాలో చెప్పాలి. నేను అది చేస్తాను' అని మొక్కుకున్నాడు. శివ ఉద్దేశం సాధన గురించి అది చెయ్యి ఇది చెయ్యి అని చెబుతారని అనుకున్నాడు ఎందువలన మిగిలినవన్నీ లౌకికాలు కాబట్టి. అందువల్ల ఆధ్యాత్మికంగా

చెబుతారని అనుకున్నాడు చదువులు ఉద్యోగాలు అంతకంటే ఎక్కువ ఏదో ఉంది దాని గురించి చెప్పాలి అనుకున్నాడు.

గొలగమూడి నుంచి తమ ఊరు వచ్చే ముందర సుబ్బరామయ్య సార్ గారి దగ్గరికి వెళితే సార్ శివతో **"నీకు వెంకయ్య స్వామి సీట్ ఇప్పించారు. అందువలన టాప్ మోస్ట్ గా ఎవ్వరూ చేయలేనంతగా చేసి ఆయనను సంతోషపరిచేటట్లు చేయాలి'** అని చెప్పారు. ఎన్ని సార్లు పారాయణ చేయాలో చెప్తారు అనుకుంటే ఇలా చెప్పారు ఏమిటీ? సరేలే అనుకున్నాడే గానీ సార్ చెప్పిన విషయాన్ని అంత సీరియస్ గా తీసుకోలేదు. తర్వాత శివకు తెలియకుండానే సార్ కి లెటర్లు వ్రాయించటం స్టార్ట్ చేయించారు. అప్పటిదాకా ఐఐటీ కి ప్రిపేర్ అవ్వాలి. లాంగ్ టర్మ్ కి ప్రిపేర్ అవ్వాలి అనే ఆలోచనలు పోయి స్వామి మెచ్చుకునే అంతగా చదవాలి, టాప్ మోస్ట్ గా చదవాలి అనే భావన తెప్పించారు చేయించారు. ఆ లెటర్ వ్రాసి ఆయనే మోటివేట్ చేసి చేయించారు. తర్వాత ఎక్కడైనా బయట తింటే శివ ఆరోగ్యం పాడవుతూ ఉన్నప్పుడు సార్ కి లెటర్ రాసి సార్ చెప్పినట్లు చేయటం శివ స్టార్ట్ చేశాడు. అప్పుడు సార్ మాటే వేదం. తన వంట తనే తినటం అనేది అప్పట్లో వింతగా కొత్తగా ఉండేది. ఎక్కడికి వెళ్ళినా ఏ ఊరు వెళ్లినా అలానే చేసేవాడు. ఎప్పుడైనా ఎవరైనా ఆ విషయమై తిట్టినప్పుడు సార్ కు లెటర్ రాస్తే సారు ప్రత్యుత్తరంతో సమాధాన పరిచేవారు. సార్ చెప్పిన దాన్ని ఆచరించేవాడు. అప్పుడు ఎలా మార్చారు అంటే అంటే తక్కిన ప్రపంచమంతా ఒకపక్క, సార్ మాట ఒక పక్క ఉండేది. సార్ చెపితే రెండో ఆలోచన లేకుండా సార్ మాట ఖచ్చితంగా పాటించాలి అనేది ఉండేది. అది చాలా గొప్ప విషయం ఎందువలన సార్ యొక్క గొప్పతనం ఎట్లానో తెలియదు కానీ ఆయన గొప్పతనం తెలియకుండా ఆయన మాట

కచ్చితంగా చేయాలి, ఆయన డైరెక్షన్ ఫాలో అవ్వాలి అనేది సామాన్యంగా జరగదు. అది కేవలం ఆయన కరుణ కృప మాత్రమే. ఒక విషయం ఇలా చేయాలి అనుకున్నది కొన్ని సంవత్సరాలు అయినా కొన్ని కొన్ని విషయాలు ఎన్ని జన్మలైనా చేయలేము కానీ చాలా విషయాల్లో అలా చేయించటం సార్ తమ తపశ్శక్తిని ధారపోసి అనుక్షణము ఇక్కడ సర్వాంతర్యామిగా చూస్తూ చేయిస్తున్నారు అనే అనుభవాలు ఎన్నో ఇచ్చారు.

ఒకసారి కలలో సార్ వారి ఇంట్లో ఉన్నారు. శివను పిలిచి టీవీ చూడద్దు అని చెప్పారు అంటే సార్ అనుక్షణం గమనిస్తూ ఎప్పుడు ఏమి చేయాలో ఎలా చెప్పాలో చెబుతున్నారు.

కొంతకాలమైన తరువాత ఆఫీసులో మాట్లాడుతున్నప్పుడు వారు ఇలా చేశారు వీరు ఇలా చేశారు అని, ఎవరికి ఎలా చెప్పాలి అనే ఆలోచనలు వస్తూ ఉండేవి. డిసెంబర్ 20 2019 రాత్రి కలలో రామయ్య సార్ కనబడ్డారు : కలలో సాయి అన్నయ్య, ప్రసాదు, నేను సార్ దగ్గర సార్ ఇంటి ముందర వరండాలో కూర్చున్నాము. ఎప్పటిలాగే సుబ్బరామయ్య సార్ చెబుతున్నారు "ఎవరితో ఏమన్నా, ఎవరికి ఏమి చేసినా, ఎవరి గురించి ఆలోచనలు వచ్చినా అది భగవంతునికే చెందుతుంది" అని చెప్పారు. సార్ చెప్పినది ప్రసాద్ కు అర్థం కాకపోవడం వలన సార్ ఏమి చెప్పారు అని శివను అడిగాడు. శివ తనకు అర్థమైనది ప్రసాద్ తో 'ఇతరులతో ప్రవర్తించేటప్పుడు వారిలో భగవంతునే చూస్తూ ఏమి చేసినా అది భగవంతునికే చెందుతుంది అని చెప్పారు ' అని అన్నాడు. అంటే శివ భావమేమంటే అలా భగవంతుని చూడకుండా చేస్తే ఎదురుగా ఉన్న మనిషికి చెందుతుంది అని. వెంటనే సార్ నవ్వుతూ "అది కాదు స్వామీ! నేను చెప్పింది. **వారిలో నువ్వు భగవంతుని చూసినా చూడక పోయినా ఆ**

**ప్రతి చర్యలూ ఆలోచనలు మాటలు పనులూ కూడా భగవంతునికే చెందుతుంది**" అని చెప్పారు. అంటే నువ్వు ఎదుటి వ్యక్తిలో భగవంతుని చూసినా చూడకపోయినా నువ్వు చేసేది అనుకునేది ఆ భగవంతునికే చెందుతుంది అని చెప్పారు

ఎప్పుడు ఏది అవసరమో ఆ ఆ సమయానికి అది చేస్తూ ఆయన నిత్య సత్యులుగా నడిపిస్తున్నారు. మన పిల్లల్ని ఏదైనా పని చెప్పినప్పుడు వారి చేయకపోతే ఒకటి రెండు సార్లు చెప్తాను అప్పటికి చేయకపోతే సిగ్గుండాలి మాకైనా సిగ్గుండాలి ఇంక చెప్పకూడదు ఎన్నటికీ ఈ విషయం వాళ్ల దగ్గర ప్రస్తావన చేయకూడదు అని వస్తుంది. అలాంటిది సుబ్బరామయ్య సారు ఎన్నిసార్లు చెప్పారు, ఎన్ని జన్మల నుంచి చెబుతూ ఉన్నారు? మనం చెయ్యకపోయినా ఆయన ఏ మాత్రం పట్టు వదలకుండా ప్రేమతో కరుణతో మనకు చెప్పే విధానం చూస్తే అనంత కరుణామయుడు అని చెప్పి తెలుస్తుంది లేకపోతే మనం మన పిల్లల్ని రెండుసార్లు చెప్పి చేయకపోతే వదిలేద్దాం అనుకుంటాము. మరి సారూ ఏనాడు కూడా ఎన్ని సార్లు చెప్పాలి లేకపోతే అసహనంగా మాట్లాడిన సందర్భాలు లేవు సారూ నిత్య సత్యులై అనుక్షణము చూస్తూ నేర్పించినది ఇప్పుడు చెప్తాను

ఆఫీస్ లో గాని నీ ల్యాబ్ లో గాని సెక్రటరీ కి ఏమి చేయాలో చెప్పాను తర్వాత ఆ సెక్రెటరీ చేసే పని తీరును బట్టీ ఆమెకి మినిమం ఏమి చెయ్యాలో కూడా తెలియకపోతే ఎలా ఉంటారు, ఈ మాత్రం కూడా తెలియదు అని మనసులో భావన ఉండేది. అంతేకాకుండా కొన్నిసార్లు సెక్రటరీతో ప్రతి ఒక్క విషయము నేను చెప్పాలా ఈ మాత్రం కూడా తెలియదా నేను నీకు సెక్రటరీనా లేక నీకు నేను సెక్రటరీనా అనే ఆలోచనలు వచ్చాయి. వాళ్ళలో భగవంతుడిని చూడటం కానీ వారి పట్ల మన భావాలు ఎలా ఉన్నాయో

చూపించటానికా అన్నట్లు ఒకరోజు స్వప్నంలో సార్ శివకు కరెంట్ మీటర్ బిల్లు ఇచ్చి ఒక ఇల్లు చూపించి పని చేయమని చెప్పారు. సార్ ఏమి చేయమన్నారో శివకు అర్థం కాలేదు. సార్ వెంటనే గబా గబా వచ్చి ఇది చెప్పాను ఇలా చెయ్యాలని చెప్పాను అని చెపుతున్నారు. (సార్ భౌతికంగా ఉన్నప్పుడూ కూడా చెప్పిన చిన్న పనులు అర్థం కాకపోయినా సార్ ఏనాడూ ఇది కూడా అర్థం కాలేదా ఎందుకయ్యా ఈ చదువులు అని ఏనాడూ అనలేదు కానీ నేను ఏమి చేస్తున్నాను ఈ మాత్రం తెలియకపోతే వీళ్ళ ఇంత చదువుకుని ఉపయోగం ఏముంది? అని అంటున్నాను) అంటే నాకు ఏమి చెయ్యాలో నేర్పిస్తున్నారు చెబుతున్నారు ఆ సంఘటనతో మీకు ఎన్ని సార్లు చెప్పాను, ఎలా చేశాను. మీరు అవతల వారితో ఏమి చేస్తున్నారు అని చెపుతున్నట్లున్నది.

మదన్ కుమార్ పిల్లవాడికి మార్చి 2020 లో జలుబు దగ్గు గా ఉండేది. కనీసం మూడు నెలల నుంచి ఇబ్బంది పడేవాడు. ఆ సమయంలో కరోనా అని చెప్పి డాక్టర్ దగ్గరికి తీసుకు వెళ్లి పరీక్షించడానికి భయపడ్డారు. ఎప్పుడైతే ప్రతిరోజూ 8:30 గంటలకు సత్సంగం స్టార్ట్ అయిందో ఆ తర్వాత మూడు రోజుల కల్లా మదన్ కుమార్ పిల్లవాడికి జలుబు, దగ్గు తగ్గిపోయాయి.

**ఆశ్రిత కల్పవృక్షం - [సతీష్ కి ఉద్యోగం + మెరుగైన ఆర్థిక పరిస్థితి + ప్రతి చిన్న పనికి ఆధార పడేటట్లు చేయటం]** Audio

వెంకయ్య స్వామి దగ్గరకు సతీషు తన ఆరో క్లాసు నుంచి వస్తున్నా సుబ్బరామయ్య సార్ గురించి తెలియదు. బీటెక్ అయిన తరువాత మొట్టమొదటిసారి గొలగమూడి లో సార్ దర్శనం అయ్యింది. బీటెక్

అయిన మూడు సంవత్సరాల దాకా సతీష్ ఉద్యోగం రాలేదు . ఒకసారి స్వప్న లో ఒకసారి ఒక పెద్ద అల సతీష్ వైపు వస్తోంది. దాంట్లో మునిగిపోతాడని భయం వేసి పరిగెడుతున్నాడు. ఇంతలో జనాల మధ్యలో నుంచి సుబ్బరామయ్య సారు వచ్చి సతీష్ చేతిలో ఉన్న బరువైన బ్యాగు ఒకచేత్తో పట్టుకుని రెండో చేత్తో సతీష్ ని పట్టుకొని నడుస్తున్నారు. సార్ కి అప్పుడు కాలు సరిగా లేక నడక సరిగ్గా లేదు. సతీష్ సార్ తో 'మీరు ఎందుకు సార్ బాగ్ పెట్టుకునేది. నాకు ఇవ్వండి' అని అన్నాడు. సుబ్బరామయ్య సార్ ఏమీ మాట్లాడకుండా నడుస్తున్నారు. నేరుగా గొలగమూడి వెంకయ్య స్వామి అగ్నిగుండం దగ్గరకు తీసుకువచ్చి సతీష్ ని అక్కడ వదిలిపెట్టారు. అక్కడ నుండి సార్ ఇంకొక వ్యక్తి తో వెళ్ళిపోయారు. ఆ సంఘటన బట్టి సతీష్ కు తన పాపకర్మలు సుబ్బరామయ్య సార్ తీసివేశారు అని అనిపించింది. ఆ స్వప్న దర్శనం తర్వాత రెండు నెలలకు సతీష్ కు ఉద్యోగం వచ్చింది.

కేరళలో ఉద్యోగం వచ్చినందుకు ఆనందంగా ఉన్నా గొలగమూడికి దూరంగా కేరళలో కాకుండా ఏదైనా బెంగళూరులో కానీ చెన్నై లో కానీ పోస్టింగ్ వస్తే బాగుండేది కదా అని ఆలోచనలు వచ్చాయి. ఆ సమయంలో ఒకసారి గొలగమూడికి వచ్చి వెంకయ్య స్వామి దర్శనం చేసుకుని 108 ప్రదక్షిణలు చేసి స్వామికి మనసులోనే 'సార్ ఉద్యోగం విషయం ఏదైనా చెప్పాలి' అని అనుకున్నాడు. సాయంత్రం సత్సంగంలో సార్ మాట్లాడుతూ "నీటి ఋణం, నిద్ర ఋణం తీరాలి. స్వామి ఎక్కడ పెడితే అక్కడికి వెళ్లాలి. స్వామి దగ్గరే ఉంటాను, వారం వారం గొలగమూడి రావాలి, స్వామి అన్నం తింటాను అంటే కుదరదు" అని చెబుతూ సతీష్ తో "అర్థమైందా స్వామి?"

అని అడిగారు. దానితో సతీష్ కు తన మనసులో ఉన్న ఆలోచనలు సుబ్బరామయ్య సార్ కు తెలుస్తున్నాయని తెలిసింది.

ఉద్యోగంలో చేరిన తరువాత డెన్మార్క్లో ఒక ప్రాజెక్టు కోసం సతీష్ ను వెళ్ళమన్నారు. వీసాకి అప్లై చేయడానికి అతని ఇంజనీరింగ్ సర్టిఫికెట్ ఒకటి కావాలి. అది యూనివర్సిటీ లోనే ఉంది. సామాన్యంగా దాని దాని కోసం అప్లై చేస్తే మూడు నెలల తర్వాత వస్తుంది. సతీష్ కు త్వరగా కావాలని చెప్పి గొలగమూడిలో సార్ కు చెప్పుకొని అనంతపురం వెళ్లాడు. యూనివర్సిటీలో ఆ సర్టిఫికెట్ కోసం అప్లై చేస్తే అక్కడ ఉన్న క్లర్క్ "మీకు మూడు నెలల తర్వాత మేం పంపిస్తాం" అని చెప్పాడు. ఆఫీసులో అతని వెనకాల సాయిబాబా ఫోటో ఉంది. సతీష్ బాబా నామం చెప్పుకుంటూ అక్కడే ఉన్నాడు. కొంతసేపటికి సతీష్ ఆ క్లర్క్ తన విషయం మొత్తం చెప్పాడు. అతను అర్థం చేసుకుని మూడు నాలుగు గంటల లోపల ఆ సర్టిఫికేట్ ఇచ్చేశాడు. మూడు నెలల తరువాత రావలసిన సర్టిఫికెట్ మూడు గంటల్లో చేతికి రావడం అంటే అది కేవలం సుబ్బరామయ్య సార్ కృప.

సతీష్ వాళ్ళ ఆర్థిక పరిస్థితి అప్పుల వల్ల బాగా లేదు. అప్పుడు అతను చేసే ఉద్యోగం ఒక మూడు నాలుగు సంవత్సరాలు చేస్తే గాని ఆ అప్పులు తీరవు. అలాంటిది డెన్మార్క్ పంపించి సార్ సతీష్ కు ఆరు ఏడు నెలల పాటు రెండు జీతాలు (ఒకటి ఇండియా లోది, రెండవది డెన్మార్క్ లోది) ఇప్పించారు. అంతేగాకుండా అతను ఉండటానికి ఇల్లు కూడా కంపెనీ వారే ఇచ్చారు. దానితో అతనికి ఖర్చు ఏమీ ఉండేది కాదు. అందువలన వారికి ఉన్న అప్పులన్నీ కూడా ఆ ఆరు నెలలలో తీర్చేశారు.

డెన్మార్క్ లో సతీష్ ఒక పాకిస్తానీ మేనేజర్ క్రింద పని చేయాల్సి వచ్చింది. అంతకు ముందు అతని దగ్గర ఏడుగురు ఉద్యోగస్తులు మూడు

నెలల్లో వెళ్లిపోయారు. సతీష్ మనసులోనే సార్ కి మీరే రక్షించాలి అని చెప్పుకున్నాడు. ఒక నెల తరువాత ఆ మేనేజర్ సతీష్ ని అభినందిస్తూ ఈ-మెయిల్ చేశాడు

డెన్మార్క్ నుంచి వచ్చిన తర్వాత సతీష్ వాళ్ల కంపెనీ వాళ్ళు H1 వీసా ప్రాసెస్ చేసి యూఎస్ కి పంపించారు. 2020 మొదట్లో ఒక పెద్ద ప్రాజెక్టు వచ్చింది. చేసేయగలమని ఆ ప్రాజెక్టు సతీషు ఒప్పుకున్నాడు. ఆ ప్రాజెక్టు మీద కొన్ని నెలలు కష్టపడి చేసినా పూర్తి కావట్లేదు. చివరికి తన తప్పు తెలుసుకున్నాడు అంటే సతీషు ఏ ప్రాజెక్టులోకి వెళ్లాలన్నా, టైమ్ లైన్స్ కి ఒప్పుకోవాలన్నా సుబ్బరామయ్య సార్ (పటానికి) దగ్గర చెప్పుకున్న తర్వాత మాత్రమే ఆఫీసులో వారికి చెప్పేవాడు. ఆఫీసులో ఈ పెద్ద ప్రాజెక్టు వచ్చినప్పుడు సుబ్బరామయ్య వారికి చెప్పకుండా తను చేసేయ గలడు అనే నమ్మకంతో ఒప్పుకొన్నాడు. కానీ పని జరగక పోయేసరికి సార్ కు 'పూర్తి ప్రయత్నం చేశాను, నా వల్ల కావట్లేదు మీరే హెల్ప్ చేయాలి" అని చెప్పుకుని పడుకున్నాడు. తర్వాత రోజు ఉదయం ఆఫీసులో వర్క్ గురించి కొత్త ఐడియాలు వచ్చి తొందరగా పని పూర్తయింది. అన్ని ప్రోగ్రామ్స్ సక్సెస్ ఫుల్ గా రన్ అయ్యాయి టెస్టింగ్ పూర్తయిపోయింది. ఈ సంఘటనతో ప్రతి చిన్న దానికి గురువు మీద ఆధారపడాలి అనేది మనందరికీ మార్గదర్శకం.

**ఆశ్రితకల్పవృక్షం -[భవానీగారికి ప్రాణభిక్ష + సత్సంగ పవిత్రకార్యం చేయించటం + అడగకుండానే ఉత్తరాల ద్వారా ఓదార్పు, దిశా నిర్దేశం]**

Audio

భవాని గారు (మక్కినవారి గూడెం) ఇలా చెబుతున్నారు: నేను ఈరోజు ఇలా ఉన్నాను, బ్రతికి ఉన్నాను అంటే అంటే సుబ్బరామయ్య సార్ గారు

దయ కారణం.  నేను ఏ కష్టం వచ్చి ఏ బాధ లో ఉన్నా నేనేమీ చెప్పకుండానే సారు దగ్గరనుండి లెటర్ వచ్చేది.

భవానీగారి అక్కగారికి ప్రమాద పరిస్తితి వచ్చినప్పుడు అన్ని వైద్య ప్రయత్నాలు విఫలమై పోతే గొలగమూడిలో 120 రోజులు (3 మండలాలు వెంకయ్యస్వామి దగ్గర) ఉన్నారు. ఆ సమయంలో సుబ్బరామయ్య సార్ తమ ఇంటిని వారికి ఇచ్చేశారు. అలాంటి సమయంలో ప్రతిరోజూ సార్ సత్సంగానికి వెళ్ళేవారు. సార్ సత్సంగమ్ అద్భుతంగా ఉండేది. సార్ ఎంతో ధైర్యం చెప్పి భవానీ గారి అక్కగారికి అండగా ఉన్నారు. అప్పుడే భవానీ గారి అమ్మాయికి థైరాయిడ్ ఉంటే 40 రోజులు స్వామి దగ్గర ఉంది ప్రదక్షిణలు చేస్తే తగ్గిపోయింది. అప్పుడు భవానీ గారు సుబ్బరామయ్య సార్ కి పాద నమస్కారం చేస్తే కరెంట్ షాక్ కొట్టినట్లు అయ్యింది. అప్పటి నుండి భవానీ గారికి సార్ దైవాంశ సంభూతులు అనే భావనా కలిగింది.

ఒకసారి భవానీగారి నాన్నగారు చనిపోయినప్పుడు ఆమె చాలా బాధపడుతున్నారు. ఆమె ఏమీ అడక్కుండానే సారు ఉత్తరం రాసి దాంట్లో భరద్వాజ మాస్టర్ గారి సతీమణి అమ్మగారి గురించి రాశారు. అందులో "మన అందరినీ కాపాడేది భగవంతుడు. భరద్వాజ మాస్టారు గారు సమాధి అయినప్పుడు అమ్మగారికి ఇద్దరు పిల్లలు, ఒంట్లో అనారోగ్యము, చేతిలో చిల్లిగవ్వ లేదు. కానీ ఆమె బాధపడ్డారా? అన్నిటికీ బాబాయే ఉన్నాడు అన్నారు. ఆవిడ ఎలా ఉన్నారు ఇప్పుడు. నీకు, పిల్లలకి స్వామి ఆశీస్సులు ఉంటాయి" అని వ్రాసారు.

భవానీ గారి నాన్న గారు చనిపోయిన తరువాత కొన్ని రోజులు బద్దకించి రోజు చేసే ప్రదక్షిణలు, పారాయణ చేయలేదు. సార్ ఒక లెటర్ లో "ఇచ్చిన సదవకాశం సద్వినియోగం చేసుకోకపోతే బూడిదై రాలిపోతావు

అని వ్రాసారు. ఆ సందేశంతో మరలా ప్రదక్షిణలు, పారాయణ ప్రారంభమైనాయి.

భవానీ గారి నాన్న గారు చనిపోయిన తరువాత ఆమె అమ్మగారిని చూడాల్సి వచ్చింది. అప్పుడు సుబ్బరామయ్య సార్ గారు చెప్పినది ఏమిటంటే "మీ అమ్మ అనే భావంతో చూడకు. వెంకయ్య స్వామికి సేవ చేస్తున్నాను అని భావనతో చెయ్యి" అని చెప్పారు అలానే ఆమె తన అమ్మగారిని సేవ చేసుకోవడం జరిగింది. ఇదంతా యొక్క సార్ కృప.

సత్సంగ మహిమ ఆయన గొలగమూడి లో ఉన్న ప్రతి ఒక్క విషయానికి సమాధానమిస్తూ అడిగిన అడగకపోయినా సమాధానమిస్తూ నడిపిస్తూ చేశారు అలాంటి సార్ కు శతకోటి వందనాలు.

భవాని గారికి ఆమె భర్తతో ఇబ్బందులు రావటం వలన వారిరువురూ విడిపోయారు. ఆ విషయమై భవాని గారు బాధపడుతూ సాయిబాబా వెంకయ్య స్వామి వారి చరిత్ర లో అలాంటి సంఘటన జరిగినవి గుర్తుచేసుకుంటూ మనసులో బాబాతో రాత్రి ఒంటి గంటకు 'మీరు సర్వజ్ఞులు కదా! ఇలా అయింది ఏమిటి స్వామి' అని చెప్పి వాపోయారు. తర్వాత రోజు ఉదయం పది గంటలకి సార్ దగ్గర్నుంచి ఒక ఉత్తరం వచ్చింది. ఉత్తరంలో సార్ "నీ చేత పవిత్రమైన కార్యం జరిపించాలని సాయిబాబా యొక్క ఆజ్ఞ" అని చెప్పారు. తరువాత సార్ చెప్పినట్లే చుట్టుపక్కల గ్రామాలలో సత్సంగం చేయటం జరుగుతోంది. 2019 దాకా వారం వారం సత్సంగమ్ చేసేవారు. ఒకరోజు సార్ కలలో "మందిరం బ్రహ్మం గారి మఠం అంతా దూరం ఉంటుందా" అని అడిగారు. ఆ రోజు నుండి ప్రతిరోజు మందిరంలో సత్సంగం చేస్తున్నారు. సత్సంగాల వలన చాలామంది ఇప్పుడు గురు చరిత్ర పారాయణ, సాయి లీలామృతం

పారాయణం చేస్తూ ఉన్నారు. ఆ పవిత్ర కార్యానికి భవానీ గారిని నిమిత్తంగా చేసుకొని సాయిబాబా చేయిస్తున్నారు అనేది సార్ కి ఎలా తెలుసు వారిద్దరూ ఒకటి కాకపోతే తప్ప?

ఒకసారి రాత్రి పన్నెండు గంటలకి 11 గంటలకి భవానీ గారు బాధపడితే తెల్లవారుజామున 11 గంటల కల్లా సార్ దగ్గర నుంచి లెటర్ వచ్చింది. తరువాత భవానీ గారు సార్ తో 'నేను బాధపడుతున్నది మీకు ఎలా తెలిసింది ఎందుకు లెటర్ వ్రాసారు' అని అడిగితే అడిగితే "ఏమోనమ్మా బాబా చెప్పారు నేను వ్రాశాను" అని సార్ అన్నారు. దాన్నిబట్టి సారు ఎంత సర్వజ్ఞులు ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ చుట్టుపక్కల అంతా కూడా లక్ష్మి గారి ప్రేరణ. ఆమెకు భరద్వాజ మాస్టర్ గారి చేయమని చెప్పటం ఇక్కడ చేయడం వల్ల ప్రతి ఒక్క ఇంట్లో సాయి లీలామృతము గురుచరిత్ర పారాయణ చేయని ఇల్లు లేదు.

ఒకసారి భవానీ గారి అమ్మగారికి ఒంట్లో బాగా పోవడం వల్ల రాయవెల్లూరు లో హాస్పిటల్లో చేర్చారు. వాళ్ళ అమ్మ గారు భవాని గారిని చేతికి వెంకటేష్ స్వామి దారం కట్టమంటే ఆమె కట్ట లేదు ఎందువలన అంటే భవాని గారు ఎప్పుడూ కూడా గొలగమూడి వచ్చినప్పుడు సుబ్బరామయ్య సార్ గారి ద్వారా స్వామి దారం కట్టించుకునే వారు. అందువల్ల వాళ్ళ అమ్మగారికి కట్టలేదు. భవాని గారి ఆక్క గారు (నాగమణి గారు), ఆమె అబ్బాయి వచ్చి వెళ్తున్నప్పుడు భవాని గారు హాస్పిటల్ లో రూమ్ అడ్రస్ ఇచ్చి సార్ ను స్వామి దారం పంపించమని కోరారు. ఆ విషయం చెబితే సార్ మాస్టర్ గారి ఫోటోలు బాబా గారి ఫోటోలు 3 వెంకటేష్ స్వామి ఫోటోలు పంపిస్తూ దానితో ఒక చిన్న పేపర్ లో **"ఆధ్యాత్మికత అంటే సుఖానికి పొంగక కష్టానికి క్రుంగాక జీవితాన్ని**

**గడపడమే"** అని వ్రాశారు. సార్ యొక్క ఉత్తరం, స్వామి దారం చూసి ఆమెకు ధైర్యం వచ్చింది. సార్ పంపించిన దారం భవానీ గారి అమ్మగారికి, పురుడు రాదు ఆపరేషన్ చేయించుకోవలసిన ఆవిడకి, ఇంట్లో కేకలు వేశారని పురుగుల మందు త్రాగి చావు బ్రతుకులా మధ్య నున్న పిల్లకి కట్టారు. భవానీ గారి అమ్మగారికి జబ్బు నయమైంది, ఆపరేషన్ చేయించుకోవలసిన గర్భవతికి సుఖ ప్రసవం, పురుగు మందు త్రాగిన పిల్లకు ప్రమాదం తప్పిటం జరిగింది. ఈ విధంగా సార్, స్వామి ముగ్గురు ప్రాణాలు కాపాడారు మరియు భవానీ గారికి ధైర్యమిచ్చారు.

## శ్రీ సుబ్బరామయ్య సార్ లేఖలు

**30-04-1997 న శ్రీమతి భవానీ గారికి : కష్టాలకు క్రుంగక, సుఖాలకు పొంగక, చివరి శ్వాసవరకు విశ్వాసంతో ఉండడమే నిజమైన భక్తి – భవానీ గారు నిస్పృహతో ఒకరోజు భాధ పడగా మరురోజు శ్రీ సార్ నుండి (అడుగకనే) వచ్చిన సందేశం ఇది.** Letter1_Audio

గొలగమూడి
30-04-1997
పూజ్య గురుబంధు శ్రీమతి భవానీ గారికి శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా కలుగవలెనని ప్రార్థిస్తూ పెసల సుబ్బరామయ్య వాయడం.

మీరు నన్ను దైవాంశసంభూతులని వ్రాయటం తగదు. అర్హతలేని దానిని నెత్తిన పెట్టుకొంటే అణగిపోవడం తప్ప మరేమీ ప్రయోజనం లేదు. మీకు జాబు వ్రాయాలని ఈ కాగితం తీసుకున్నాను. ఎంత చిత్రమో ! ఈ కాగితం వెనుక ఉన్నవారి అనుభవం చూడండి. ఒకామెకు శ్రీ స్వామి









వారంటే తెలియదు, కాని నిన్ను నమ్ముతాను నా ఆరోగ్యం చేకూరితే అని షరతు పెట్టింది. ఆ పరమ కారుణ్యమూర్తి ఆమె కోరిక తీర్చి నమ్మిక కుదుర్చినారు. అయితే ఆమె ఆ భక్తిని చివరి శ్వాస వరకూ ఉంచుకొని, కాపాడుకునే బాధ్యత ఆమెపై ఉంది. ఆమె అలా చేయకుంటే కష్టాలు తప్పవు. 2వ అతను అన్ని విధాల బాగా విసిగి పోయి బాగైతే టెంకాయ కొడుతాను, చనిపోతే ఇక్కడే పూడ్చేసి పోతాను, ఈలోగా ఈ గ్రామం వదలి పోను అన్నాడు. 3వ నాటికే నయం అయింది. చివరి శ్వాసవరకు విశ్వాసాన్ని నిలుపుకొనే భాధ్యత మనపై ఉంది. ఇలాంటి పేపర్ మీకు జాబ్ వ్రాయడానికి రావడమే చిత్రము. జాబు వాసే ముందు ఆ ప్రింటు చూచి మీ విశ్వాసాన్ని బలపరచుకొండి. కష్టాలకు క్రుంగక, సుఖాలకు పొంగక ఉండడమే నిజమైన భక్తి. 1979లో మాష్టారుగారు కొన్ని విషయాలు చెప్పారు. అవి ఒక పెండ్లి పత్రికలో వ్రాసుకొన్నాను. అందులో అంటారు, ఇప్పటి మన పరిస్థితులు, బంధువులు, స్నేహితులు, ఆశ్రితులు, వీరి ద్వారా మనకు కలిగే అనుభవాలు అన్నీ పూర్వం మనకు వారికి గల ఋణానుబంధామునుసరించి కలిగేవే. బ్యాంకులో డబ్బు తీసి అప్పులవారికి కడుతూ బాధపడడమెందుకు. ఆయా ఋణానుబంధాలు తీరిపోగానే మనుషుల మనస్సులు మారి మన ఎదుటివారి ప్రవర్తనలో మార్పు చూపిస్తారు అని సెలవిచ్చారు. ఇందుకు వారే ఉదాహరణగా నిలిచారు.

ఒకతను అమ్మ, అక్క అని బూతులు తిట్టి కత్తి చూపిస్తూ షుమారొక నెలరోజులు నిర్ధోషియైన తనను తిడుతుంటే కూడా వారు పై సూత్రాన్నే మనసులో నింపుకున్నారు. బాకీ చెల్లిపోతుంటే సంతోషించాలి కానీ ఆ ఎదుటి వ్యక్తి పై ద్వేషం వహించరాదు. అలా వహిస్తే తిరిగి మరు జన్మకు చెన్నబసప్ప, వీర భద్రప్పలలాగా తయారవుతామని అనుక్షణమూ నిర్లిప్తంగా ఉండేవారు. 6 నెలల తరువాత ఆ దూషించిన వాడు మనసు మారి మాష్టరుగారి పాదముల మీద పడి క్షమాపణ వేడుకోవాలంటే అక్కడున్నవారు అతనిని దగ్గరకు రానీయలేదు, కానీ ఆ కరుణామయుడు ఆ వ్యక్తిని దగ్గర కూర్చోబెట్టుకున్నాడు. అతడు మాష్టరుగారి పాదములపై పడి క్షమించమని వేడుకొని కంటికి కడివెడు కన్నీరు కారుస్తాడు. కానీ


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాష్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ ధగ్గాస్వామి

మాష్టరుగారు అంటారు "నీవు నన్ను ఏమీ చేశావని క్షమించమంటావు, అందరినీ క్షమించేది బాబా గదా. అదంతా మరచిపో " అని తలనిమిరాడు. గనుక మనం కూడా మన చెడ్డ అనుభవాలను, పూర్వ జన్మలో మన చెడ్డ కర్మే ఇప్పుడు వారికలాంటి బుద్దులు కలుగ చేసింది. వారిని మనం నిందించరాదు అనే విశ్వాసంతో ఉండి శ్రీ సాయీశుని కృపను పొందే యత్నము చేయాలి.

మందిరానికి మీవారు పోవద్దన్నాక మీరు హృదయ పూర్వకంగా పోకుండా ఉండండి. నాకు సత్సంగం ప్రసాదించమని సాయిని వేడుకోండి. ఇంట్లోనే సత్సంగం ప్రసాదిస్తారేమో మనకేమి తెలుసు. సాయి ఏది చేసినా మన మంచికే చేస్తారు అని హృదయపూర్వకంగా నమ్మండి. నిత్యం ఇంటిలో ఉతికినగుడ్డ కుర్చీలో పరచి సాయి పటంగానీ లేక ముగ్గురి పటాలు పెట్టి నిత్యం ఒకే టైంలో 108 కి తగ్గకుండా ప్రదక్షిణలు చేయండి. ఇది అది అని కోరకుండా నాకు తృప్తి, శాంతి ప్రసాదించండి. మీరు ఎల్లప్పుడూ నాకు తోడుగా నిలవండి. నాకీ జన్మకింకేమీ వద్దు అని పార్థిస్తుండండి. మనకేది మంచిదో అది మనకంటే వారికే చక్కగా తెలుసు. టైఫాయిడ్ బిడ్డ తల్లి పెరుగన్నం పెట్టలేదని తల్లిపై అలుగుతుంది. కానీ తల్లి పెడుతుందా? గీ పెట్టినా పెట్టదు. బార్లీ నీళ్లో, పళ్ళ రసమో ఇస్తుంది. సాయి కూడా మనకు అలాగే చేస్తారు. ఏది మంచిదో ఏ జీవికి ఎప్పుడు ఏమి చేయాలో వారికి తెలిసినంతగా మనకెలా తెలుస్తుంది. కృతజ్ఞతా పూర్వకమైన సంపూర్ణ శరణాగతి ఒక్కటే మనం చేయవలసిన పని. మాష్టారుగారి భార్య గారిని, తీసుకొని చూచుకోండి. ఆ మహాతల్లి పరిస్థితి ప్రపంచంలో ఎవ్వరికీ రాదు. ఇద్దరు చిన్న పసి పిల్లలు, ఆస్థిపాస్తులు లేవు. తాను నడిమంచం నుండి దిగలేదు. సర్వం మంచంలోనే జరుగాలి. మరి ఆమె సాయిని ఏమని ప్రార్ధన చేయాలి. అట్టి విషమ పరిస్థితులలో మాస్టారుగారు చాటుకు పోయారు. ఆమె గారి ముఖంలో చింత, బాధ వెతికి చూచినా కనిపించవు, అన్నింటికీ సాయినాధుడే గతి. వారిష్టానుసారం జరగనియ్. సాయినాథా నీ ఎడల నాకు గాఢమైన భక్తి విశ్వాసాలు ప్రసాదించి, ఈ విశాల విశ్వమంతా మీ లీలారూపంగా దర్శించి

పులకించే జ్ఞానాన్ని ప్రసాదించు అని మాత్రమే పార్థిస్తుంటారు. వారి పరిస్థితే మనకు ఆశయం, ధ్యేయం, ఉదాహరణగా ఉండాలి. మనలను అలా నడిపించమని హృదయపూర్వకంగా ప్రార్థించండి.

మీ భర్తగారి అభిమతానికి భిన్నంగా నడుచుకోవలసిన పరిస్థితి శ్రీ సాయి మీకు ఎప్పుడూ కలిగించకుండా ఉండాలని ప్రార్ధన చేస్తున్నాను. మనము ఇష్టము అయిష్టము అనే సంకెళ్ళలో బంధించబడినంత వరకే వారి ఇష్టానికి భిన్నంగా నడుచుకోవాలని తలుస్తాము, వారి పద్ధతి తప్పని తలుస్తాము. వారి స్థానంలో మనముంటే అప్పుడు ఎలా ఉంటుందో యోచించండి. భర్త, అత్త, మరదులు మిగిలిన వారు బిడ్డలు అందరూ బాబా రూపాలేనన్న సత్యం మరువడమే మన ఇష్టా ఇష్టాలకు కారణం. అందరూ ఆయన రూపాలే అని హృదయ పూర్వకంగా విశ్వసిస్తే ఇక వారి ఇష్టమే మన ఇష్టమవుతుంది. మనలోనే ఉన్న సాయిని చూడలేక ఎక్కడో సత్సంగంలో ఏమో చూడాలను కోవడం పొరపాటు.

మీరు మందిరం గురించి ఇంటిలోనే పారాయణ చేయండి. సర్వ జనులకు శుభం జరిపించమని ప్రార్థించండి. సాయి తప్పక చేస్తారు. అసలు సాయి కంటే మనం కరుణామయులమా? రామకృష్ణ పరమహంస అంటారు "ముందు నీవెవరో తెలుసుకో, ఆవతల దేశోద్ధరణ చేద్దువుగానీ" అని. గనుక శాంతి, సుఖము ఎక్కడ ఉన్నాయి. ఇష్టము-అయిష్టము లేకుండా, లోకం ఏమనుకుంటుంది అను భావం రానీయకుండా జీవించడం నేర్చుకోవడంలోనే నిజమైన సుఖం, శాంతి ఉంది. ఎవరి మనస్సును గాయపరచకుండా జీవించడం నేర్చుకోవాలి.

Be a beggar in your own house అంటారు మా గురువుగారు. అంటే "నీ సొంత ఇంట్లో భిక్షగానిలా జీవించడం నేర్చుకో". నాకు సుఖం, శాంతి ఈ ఒక్క సూత్రం వల్లనే ఏర్పడ్డాయని ఘంటా పథంగా చెపుతాను. నా భార్య ఎన్నో విధాల తన అభిరుచుల ప్రకారం నేను నడవాలంటుంది. సరే అలాగే, ఈ రూపంలో నా దగ్గరున్న సాయిని నొప్పించడం తగదని నా జీవితాన్నే మార్చేసుకొన్నాను. నీవు రోజుకు ఇన్ని గంటలు నిద్రపోవాలి అని ఆంక్షలు పెడుతుంటే సరే, ముసుగు తన్ని

కదలకుండా పడుకొని నామం చెప్పుకొని ఈ విధంగా సాయి నన్ను సాధన చేయమన్నాడని అలాగే చేస్తాను. నేనామె మాట పాటించానని ఆమెకు తృప్తి. జబ్బుల వాళ్ళను ఇంట్లోకి రానియ్య వద్దంటుంది. ఈ మధ్య శరీరమంతా తెల్ల బొల్లి గల అతను వచ్చాడు. రానియ్యవద్దని చెప్పింది. సరే. ఆయనకు మన పాత ఇంట్లో ఉన్న చిన్న రూము ఇచ్చేటట్లు ఏర్పాటు చేశాను. ఆమె పరిస్థితులో నేనుంటే నేను కూడా అలానే అనే వాణ్ణి కదా! మనం చెపితే ఆమెకు బోధపడదు. ఆమెతో పోట్లాడడం సాయికి అంగీకారం కాదు. ఆ రూపంలో ఉండేది ఆయనే కదా. తాజుద్దీన్ బాబా చెపుతారు. కాబాను తగలపెట్టినా పరవాలేదు, మద్యం సేవించినా పరవాలేదు. విగ్రహారాధన జరిగేచోట ఉన్నా పరవాలేదు. మనిషి హృదయం గాయపరచకు. భగవంతుని ఏడవ స్వర్గం మానవ హృదయంలో ఉంది అన్నాడు. గనుక ఆమెను నొప్పించేదే లేదు. ఇక మాకు వైరుధ్యమే లేదు. అట్లాగని ఆమె నన్ను దైవంగా భావించకుంటే ఆ ఖర్మ ఆమెకుంటుంది. నేను ఆమె హృదయాన్ని గాయపరచరాదు. గనుక శాంతి, సుఖం, హాయిగా జీవితం గడుస్తుంది. ఎన్నో విధాల నా అభిమతానికి భిన్నంగా నడుస్తుంది. అన్నింటికీ ఒకటే మందు ఇష్టము అయిష్టము లేకుండా జీవించడం. ఆశపోతే అంతా పోతుండ్లాయ్య! సత్సంగం చేస్తే శాంతి వస్తుంది, అనేది ఒక ఆశ. ఆ ఆశపోతేనే అంతా పోయేది. మందిరంలో పారాయణ చేస్తే అందరూ బాగుపడతారా ? అందరినీ బాగు పరిచేది ఆ సర్వేశ్వరుడు మాత్రమే కానీ మన పారాయణ కాదు. ఏ సాధనయినా మన ఉద్ధరణ కొరకే అనే భావన పోయి ఎదుటివారిని మన సాధన ద్వారా ఉద్ధరిస్తామని తలంచిన క్షణంలోనే మన పతనం ఆరంభ మయిందని గుర్తించమంటారు మాష్టరుగారు. మరి మాష్టరు గారు సత్సంగాలు చేయమన్నారు కదా అంటారు. సత్సంగం అంటే అందరికీ చెప్పమని మాత్రమే భావమా? మహనీయుల చరిత్ర పారాయణ మననం చేసుకోవడం కూడా సత్సంగమే. గనుక మనకు నీడ దొరికింది. ఆ నీడన వీలున్న సాధనలు చేసుకోవడమే మంచిది. అది మంచిది, ఇది మంచిది అనుకోవడం భ్రమ. ఇష్టా అయిష్టాలు లేకుండా జీవించడం. ఇతరులను గాయపరచకుండా మన

ఋణానుబంధాన్ననుసరించి తారసిల్లిన శ్రీ సాయి రూపాలే ఇవి. వీరిని సంతృప్తి పరచాలి. అప్పుడే బాబా సంతోషిస్తారు అని ఆ విధంగా నడుచుకోవడమే సాధన. ఇంటిలో భిక్షగాని జీవితం సాగించు. ప్రపంచం ఏమను కొంటుంది అన్న దృష్టి తొలగించుకో అన్న మహనీయుల వాఖ్యాలనే మనం శరణు పొందాలి.

మాష్టరుగారు ఒక్కరోజన్నారు. మానవులకు త్రికరణ శుద్ధి లోపించింది సుబ్బరామయ్య అని. ఆదెట్లా సార్ ఆన్నాను. మాష్టరు గారు: త్రికరణాలు అంటే మనస్సు, చేతలు, నోరు. ఈ మూడు ఒకే విధంగా ఉండడం తికరణ శుద్ధి అంటారు. రోజుకు అయిదు మార్లు కూడా పూజ చేసేవారున్నారు. అందులో "త్వమేవ మాతాచ పితా త్వమేవ త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ త్వమేవ సర్వం మమదేవ దేవ" అనేది ఒక శ్లోకం. తల్లి, తండ్రి బంధువులు స్నేహితులు, ఆందరూ నీవే అని ఎన్ని మార్లు అయినా శ్లోకం చదువుతాము కానీ ఆలా నడుచుకుంటామా, నోటితో చెప్పేది ఒకటి చేతలతో చేసేది మరొకటి. ఎన్నాళ్ళుగా పూజలు చేసినా వీరికి సాయికృప కలుగుతుందా అని. గనుక అందరి రూపాలలో ఆయనే ఉన్నాడు అని భిక్షగానిలా ఆశలేకుండా జీవిస్తే సుఖము, శాంతికి కరువు ఉండదు. కనుక అలా నివసించే బుద్ధిని ప్రసాదించమని శ్రీ స్వామి వారిని ప్రార్ధిద్దాము. దొరికిన ఆశ్రయాన్ని జాగరత్తతో వినియోగించుకుంటు ఇష్టం అయిష్టం లేకుండా అందరిలో బాబానే చూడాలి.

అందరినీ సాయి రూపాలుగా ఆదరిస్తుండండి. సాయి తప్పక కృప చూపుతారు.

శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా నీకుండాలని ప్రార్ధిస్తూ

మీ

సుబ్బరామయ్య

-------- సద్గురు దేవా శరణం శరణం --------


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ ఉద్ధాస్వామి

## 28-05-1999 న శ్రీమతి భవాని గారికి: అంతా మన మంచికే - దు:ఖిస్తే ఆయనకు దూరమౌతాము : కష్టాలను ఏ రీతి స్వీకరించాలి ? – శ్రీ సార్, అలివేలు అమ్మగార్ల ఆచరణ నుండి. Letter2_Audio

గొలగమూడి
28-05-1999

పూజ్య గురుబంధువు శ్రీమతి భవాని గారికి పె.సుబ్బరామయ్య నమస్కారములు. కర్మ క్రతువులు కార్డు అందింది. కానీ వారెవరైనది దమ్మపేట రాజుకు వ్రాసి కనుక్కున్న దాకా తెలియదు, మీరు చాలా దు:ఖములో ఉన్నట్లు మద్దుల ప్రసాద్ గారు వ్రాసారు.

అది మంచిదా అమ్మా! మనం శాశ్వతంగా భూమిమీద ఉంటామా? ఎప్పుడు పిలుపు వస్తే అప్పుడు తప్పకపోవాలి. అంతవరకే ఈ బంధాలు, మమకారాలు. జన్మ, జన్మలకు మనతో ఉండే వారు శ్రీ సాయి ఒక్కరే. మనం దు:ఖిస్తే ఆయన దూరమౌతారు. "అంతా మన మంచికే " అనేది మన మాటగా ఉండాలి.

మీ నాన్నగారి తర్వాత ఒక వారానికి మా అన్నగారు పరమపదించారు. అంటే యుగంధర్ నాన్నగారు అన్నమాట. లోకమంత నన్ను బాగా తిట్టినారేమో నాకు తెలియదు. నాకు మాత్రం ఒక్క కన్నీటి బొట్టురాలేదు. మరొక్కసారి తీవ్రంగా గుర్తుకు వచ్చింది. "ఎంతో తపనతో సంపాదించిన లక్షల ధనం 7 బండ్ల కట్టెలకు మాత్రం ఉపయోగపడింది" అని బాబా “పిడకలేరుకోడానికా" అన్న మాట నిరూపణౌతుందని తెలిసింది.

మనసులో ఏ బాధా లేకుండా భగవంతుడు ఎలా ఆడిస్తే అలా ఆడడంలో ఎంతో గొప్ప సంతోషం ఉంది. దాన్ని పొందే తపనే సాధన.

అందరికీ ఆపద్బాంధవుడు మాష్టారు ఉన్నారు! (మాష్టారి ధర్మపత్ని) ఆ తల్లి ఏమని విలపించాలి. చిండబ్బులేదు, ఉండను ఇల్లు లేదు. తాను నడవలేదు. చిన్న పసికూనలు. ఆమె అండ, ఆపు అంతా సాయినాధుడే. అందుకే ఈ నాటికీ ఒక్క రవ్వంతైనా కన్ను జీరబోదు వారికి.

మీరు బాధపడితే చిన్న పిల్లలు, వారు కూడా మీ కంటే ఎక్కువ బాధ పడతారు కదా! మీ తల్లిగారి సంగతి చెప్పనక్కర లేదు. మనం బాధపడితే మన తండ్రిగారైన సాయికి అమిత బాధ కలుగుతుంది. మన బిడ్డలకు బాధ కలిగితే మనకు బాధ కలుగుతుంది కదా! మరి సాయినాధుడు ఎంత బాధపడతారో ఊహించండి. త్వరగా బాకీలు తీరిపోతున్నందుకు సంతోషించండి.

ఈ మధ్య శ్రీ స్వామివారు కనీ వినీ ఎరుగని దివ్యలీల చూపారు. ఒక తల్లి బెంగుళూరులో 20 వేల రూపాయలు చేసే రవ్వల కమ్మలు, మాటీలు పోగొట్టుకొని తిరిగి తిరుపతి కొచ్చి కనుక్కొని, శ్రీ స్వామి వారికి 7 పారాయణలు చేస్తాను, కమ్మలు దొరికేటట్లు చేయమని ప్రార్థించింది. బెంగుళూరులోని తన కోడలుకు phone వచ్చింది, ఆ తరువాత 6 రోజులకు పాత పుస్తకాల పెట్టెలో గూడూరులో ఆ కమ్మలు, మాటీలు ఉన్నాయి అని. అవి అక్కడకు ఎలా వచ్చాయి? మీకు పురందరదాసు కథ తెలుసా? ఇదే విధంగా జరిగింది. పురందరదాసు కథ మరొక సారి వ్రాస్తాను.

ఇంతటి స్వామి వారు మన అండనుండగా మనం బాధపడడం మంచిది కాదు. అంతా మన మంచికే అనేది బాగా గుర్తుపెట్టుకోండి. మీరు ఒక వారం గొలగమూడిలో ఉండి విశ్రాంతి తీసుకోండి. అంతా సర్దుకొంటుంది. అమ్మ ఆరోగ్యం ఎలా ఉంది? పిల్లలు ఎలా ఉన్నారు? లెటరు వ్రాయండి. సుధాకర్ రాజుగారు వారి కాన్వెంట్ ఎలా ఉంది?

శ్రీ స్వామి వారి ఆశీస్సులతో

పె.సుబ్బరామయ్య.

మీరు “సాయి సన్నిధి” అనే పుస్తకంలో రేగే చరిత్ర మరియు జనార్ధన్ గల్వంకర్ చరిత్ర నిదానంగా ఒక్కొక్క వాక్యం వంటబట్టేటట్లు చదవండి. తప్పక చదవాలి. చదివినాక నాకు లెటరు వ్రాయండి.


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ ఉగ్గాస్వామి

## 21-01-1999 న శ్రీమతి భవాని గారికి : సంతోషానికి మార్గం - కష్టాలను ప్రసాదంగా స్వీకరించగలిగటం. Letter3_Audio

గొలగమూడి
21-01-1999

పూజ్యగురుబంధువు శ్రీమతి భవాని గారికి శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా కలుగవలెనని ప్రార్థిస్తూ పెసల సుబ్బరామయ్య వ్రాయడం.

మాస్టారు “మాయ తనకై తానే ఎవ్వరినీ తనను అతిక్రమించ నివ్వదు. మనమే మన ప్రత్యేక ప్రయత్నంతో మాయను అతిక్రమించాలి”, అని శెలవిచ్చారు. మాయను అతిక్రమించ నంతవరకూ మీకు దు:ఖం తప్పదు. మాయను అతిక్రమించే ప్రయత్నమే భక్తి, సాధన. దానిని మనకు శ్రీ మాష్టరు గారు అనుగ్రహించాలని రకరకాల కష్టాలు పెడుతుంటారు. ఆ కష్టాలను తట్టుకోలేక భగవంతుడు మనకు ఏమీ చేయలేదనుకుంటాము. భక్తిని నేర్చుకోమని మనకు ట్రైనింగ్ ఇవ్వడంలో ప్రథమ సూత్రం కష్టాలు. వాటిని (కష్టాలను) కష్టాలుగా గాకుండా, వారి ప్రసాదంగా స్వీకరించ గలిగితే ఎంత సంతోషంగా ఉంటుందో చెప్పలేను. అసలు మనం ఏమీ చేయలేము. అంతా ఆయనే చేస్తున్నాడు. ఆయన ఆడించే నాటకరంగంలో ఒక పాత్ర ఇచ్చి మనలను ఆడమన్నాడు - అని గుర్తెరిగి నడుచుకుంటే దు:ఖమే లేదు. అలాగాకుంటే మనం కొన్ని ఊహించుకొని అలా జీవించాలనుకొని ప్రయత్నిస్తే అంతా దు:ఖమయమే అవుతుంది. అన్నీ ఉండి, భర్త దగ్గరే ఉండి, కార్లలో తిరిగే వారికి ఎంత దు:ఖం హృదయంలో ఉంటుందో ఎప్పుడైనా ఊహించారా? అందరికీ అలా ఉండదు. చాలా మందికి ఉంటుంది ఎందుకు?

తీరని కోరికలే కారణం. ఉదాహరణకు: భర్తపై అనుమానం, ఆ పైన ఇద్దరికీ తగాదా. కొందరికి స్నేహితులు మోసం చేసినందున బాధ. ఢిల్లీలో ఒకరికి ఒక ఇండ్ల ప్లాటు ఉంది. వాళ్ళు బాడుగ ఇంట్లో ఎక్కడో ఉన్నారు. ఆ ఇండ్ల ప్లాటును ఒక దుండగుడు ఎవరో ఒకరికి నాదేనని చెప్పి అమ్మేశాడు. కొన్నవాడు ఇల్లు సగం కట్టినాక అసలు వాళ్ళకు తెలిసి వచ్చి

అడిగితే, 20 రోజులలో మీకు డబ్బు ఇస్తాను. ఇప్పుడు stay తెచ్చి పని ఆపవద్దు అని బతిమాలి వారంలో slab వేసి మరొకరికి అమ్మి వెళ్ళిపోయాడు. 20 రోజుల తర్వాత వచ్చి చూస్తే మనుషులు మారారు. ఇప్పుడు కోర్టుకు పోయారు. కోర్టులో 3 సంవత్సరముల నుండి కేసు నడుస్తుంది. వీళ్ళ మనసుకు అంతా ఇంతా చికాకు కాదు. ప్లాటు ఖరీదు 10 లక్షల రూపాయలు, చూస్తూ పోగొట్టుకోలేరు. ఇలాంటి బాధలు ఎన్నో. అన్నింటికీ ఒకటే వైద్యం. సాయి మాష్టరు గారికి వప్పచెప్పి నిశ్చింతగా ఉండగలగడం. ఎలా ఉండగలగడం? భవిష్యత్తులో మనగతి ఎలా? మన పిల్లల గతి ఎలా అనే చింత లేకుంటే నిశ్చింతగా ఉండగలము. అంతా చేసేది ఆయనైతే, మనం వేషగాళ్ళము మాత్రమేనని గుర్తిస్తే చింతేలేదు.

ఆశీస్సులతో

పె.సుబ్బరామయ్య

-------- సద్గురు దేవా శరణం శరణం --------

## శ్రీమతి K.భవాని గారికి : కష్ట(సుఖా)ల లో చేయవలసినది - శరణాగతి

గొలగమూడి

20-4-2001

పూజ్య గురు బంధువులైన శ్రీమతి K.భవాని గారికి శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా కలుగవలెనని ప్రార్థిస్తూ పె. సుబ్బరామయ్య వ్రాయడం.

అమ్మా! వార్తాలాపం గ్రంధములు దమ్మపేట D. నాగేశ్వరరావు (సాయి మందిర సెక్రటరి) గారికి లారీ పార్సిల్ ద్వారా పంపాను. మీకు కావలసినన్ని వారి దగ్గరే డబ్బు చెల్లించి తీసుకోండి. ఒక పుస్తకం 1వ భాగం 2వ భాగం కలిపి నూటయాభై రూపాయలు, పోస్టు ఖర్చులు వృధా అని అలా వారి దగ్గరకే పంపాను.

కుమారుడు తను ఏ గ్రూప్ తీసుకోవాలని అడిగాడు. మానవమాత్రులమైన మన ఆలోచనల కంటే సర్వజ్ఞులైన శ్రీ మాష్టరుగారు, సాయి, శ్రీ స్వామి వంటి మహనీయుల సలహా పొందడం మంచిది గదా?


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దగ్గాస్వామి

ఈ మహనీయులు పిలిచిన వెంటనే పలికేందుకు రెడీగా చూస్తున్నారు. వారు పిలిచినప్పుడు పలుకుతారనే విశ్వాసముంటే ఇక మనకు కొదువేముంది. మీరు ఈ విషయములో ఆ మహనీయుల సలహా పొందండి. ఈ బిడ్డలను మీరే నడిపించండి ప్రభూ... లోపభూయిష్టమైన మా మనస్సులను సంస్కరించు తండ్రీ అని ప్రార్థించండి.

నాగమణి గారు ఒక వార్త చెప్పారు. మీరు అత్తగారింటికి పోవాలని ఉన్నారని, శుభం. క్షేమంగా వెళ్ళండి. మీరెప్పుడూ ద్రౌపదిని నిరంతరం గుర్తుంచుకోండి. నిండుసభలో చీర పట్టుకొని మాన సంరక్షణ చేసుకునే ప్రయత్నములో ఉండినదట. చివరకు చీరంతా లాగేసినప్పుడు ఓ ప్రభూ - కృష్ణా అంటూ చేతులు పైకెత్తి జోడించింది. అప్పుడే కృష్ణుడు ఆమె చీరను తరుగులేనిది చేశాడట.

మనం ఆత్మలో ఏ సహాయము మీద ఆధారపడక సాయిపైన ఆధారపడడం కావాలి. అప్పుడన్నీ మనం కోరినవి వస్తాయా? రావు. అన్నవస్త్రాలకు కరువు ఉండనీయనని అభయం ఇచ్చారు? నిజంగా వారి బిడ్డలైన వారికి మానవుడిచ్చింది నిలువదు దైవమిచ్చింది తరుగదు.

మన ప్రారబ్ధములో ఏమేమి ఎంతవరకూ అనుభవింప చేయాలో వారికి బాగా తెలుసు. వారు సర్వం తెలిసినవారు, సర్వసమర్థులు - ఏమైనా చేయగలవారు, సర్వవ్యాపకులు అన్న హృదయపూర్వక విశ్వాసమే మనకు కావలసినది. విశ్వాసముంటే అలా నడుచుకోవడమే జరుగుతుంది. అదే విశ్వాసము.

మీవారు ఎంత దుడుకుగా ప్రవర్తించినాగానీ మీ ఆత్మలో కూడా ద్వేషభావం రాకూడదు. “పూర్వకర్మ ఈ విధంగా  ఖర్చు అవుతోంది అని వారితో ప్రేమగానే వ్యవహరించి ద్వేషాన్ని ప్రేమతో జయించాలి” అన్న మహనీయుల మాట మరువవద్దు. మీ బిడ్డలకు మీరిచ్చేది ఆధారం కాదు. వారి పూర్వ కర్మలో ఏమేమి ఉందో అది వారి నిజమైన ఆధారము. నా మిత్రులొకరి  ఆస్తంతా అప్పుల్లో విభాగాలు పోయే స్థితికి వచ్చారు. అందరికీ అంతే నమ్మా. నాకు టైం లేదు. టైం దొరికినప్పుడు వ్రాస్తాను.

మీ దైవ ప్రార్ధనలు పారాయణలు మీవారి దగ్గర సాగవని భయపడవద్దు. ఇంతవరకూ చదివిన వాటిలో మీకు తోచిన వాటిని నెమరు వేసుకుంటే అదీ గొప్ప పారాయణే.  మనసంతా ఆయన తలపులతో నింపుకుంటే అదీ ధ్యానమే. మనసును లౌకిక ఆలోచనలతో నింపడం ప్రయత్న పూర్వకంగా ఆపాలి. మన కష్టాలు మానసికంగా సాయితో చెప్పుకోవాలి అదే సాధన. కర్పూరం వెలిగించి దీపం పెట్టడం, నైవేద్యాలివ్వడం మాత్రమే సాధన అనుకోవడం పొరపాటు. దీపారాధన, నైవేద్యం, హారతి ఇచ్చే వీలుంటే సరే, లేకుంటే సర్వం మనస్సులోనే సమర్పించవచ్చు. పని చేస్తూనే పూజ హారతులు చేయవచ్చు. అదే మానసిక పూజ. అదే గొప్ప పూజ. బాహ్య పూజ కంటే అది గొప్పది. ఈ మాట శ్రీ మాష్టారే చెప్పారు. పూజ నాకొద్దని నేను ఏడిస్తే అప్పుడు చెప్పిన మాట. మీరు వాటికి కూడా వీలు లేదే అని చింత పడవద్దు. మనసులోనే చేసుకునేందుకు ఎవరడ్డు వస్తారు.

శ్రీ స్వామివారి ఆశీస్సులు సదా కలుగవలెనని ప్రార్ధిస్తూ

పె.సుబ్బరామయ్య

**--------- సద్గురు దేవా శరణం శరణం ---------**



శ్రీ షిర్డీ సాయిబాబా



శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి

1 అవధూత లీల – (భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి జీవిత చరిత్ర) 40 రూ॥
2 అవధూత లీల (ఇంగ్లీషు) Avadhuta Leela in English 30 రూ॥
3 అవధూత లీల (తమిళం) Avadhuta Leela in Tamil 50 రూ॥
4 అవధూత బోధామృతం - శ్రీ స్వామివారి బోధలు 15 రూ॥
5 శ్రీ స్వామి సన్నిధి - శ్రీ స్వామి వారితో వారి సేవకుల అనుభవాలు 15 రూ॥
6 భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి (ఇంగ్లీషు, చిన్నది) Bhagavan Sri Venkayya Swami(small)5 రూ॥
7 శ్రీ వెంకయ్యస్వామి (తమిళం, చిన్నది) Sri Venkayya Swami in Tamil (Small Book) 5 రూ॥
8 గురుస్తుతి 7 రూ॥
9 చూచి నేర్చుకో 8 రూ॥
10 శ్రీ మాష్టారుగారి బోధామృతం
(నాకు తెలిసిన మాష్టారు(1,2భాగములు)-శ్రీ మాష్టారి మంచిమాట) 40 రూ॥
11 శ్రీ ధునివాలాదాదా చరిత్ర 15 రూ॥
12 శ్రీ శివనేశన్ స్వామీజీ దివ్యచరితము 12 రూ॥
13 శ్రీ బాల్జె రంగప్పబాబుగారి దివ్యచరితము 8 రూ॥
14 శ్రీమాధవదాసుగారి దివ్యచరిత్ర 4 రూ॥
15 శ్రీ పూండి స్వామి వారి దివ్యచరిత్ర 15 రూ॥
16 శ్రీ యంత్ర దర్గాస్వామి వారి దివ్యచరిత్ర 5 రూ॥
17 శ్రీ సరోపా గారి జీవిత చరిత్ర 2 రూ॥
18 వార్తాలాపము 150 రూ॥
19 దైవం మానుష రూపేణ (దర్గాస్వామి చరిత్ర) 30 రూ॥
20 శ్రీ నాంచల్లిబాబా గారి దివ్యలీలలు 7 రూ॥
21 శ్రీ వెంకయ్యస్వామి ఆరతులు 5 రూ॥
22.శ్రీ శ్రీ శ్రీ వల్ల మస్తాన్‌బాబా గారి దివ్యలీలలు 4 రూ॥

## 1 రూపాయి పుస్తకములు

1. శ్రీ వెంకయ్యస్వామి పూజ
2. శ్రీ స్వామివారి భజన పాటలు
3. నమ్మలేని నిజ సత్యాలు
4. నమ్మినవారికి సొమ్ము - నమ్మకుంటే దుమ్ము
5. స్మృతిమాత్ర ప్రసన్నాయ నమః
6. స్మృతి రహిత ప్రసన్నాయ నమః
7. సర్వ సమర్థుడు
8. వెన్నెలపూలు – శ్రీ వెంకయ్యస్వామి దివ్యత్వం
9. దివ్యలీలలు
10. బోధ యజ్ఞాయనమః
11. ధర్మమూర్తి
12. నిలిచిన వెలిగే దైవం
13. శ్రీ స్వామికృప
14. మౌనబోధ
15. వాళ్ళు వుండేదాన్ని ఒక్క కదయ్యా మనసుండేది
16. స్వామి అనుగ్రహము
17. మాష్టరుగారి సత్సంగము
18. అమృత వాక్కులు
19. మృత్యువుపై భవన విజయము
20. శ్రీ భరద్వాజగారితో భక్తుల అనుభవాలు
21. శుద్ధ చైతన్యమే తానైన పూజ్య శ్రీ భరద్వాజ మాష్టారు గారు
22. శ్రీ మాష్టరు చూపిన సాయి మార్గం
23. శ్రీ దర్గాస్వామి వారి చరిత్ర – 2వ భాగము
24. శివుని ఆజ్ఞ
25. శ్రీ మాయి అమ్మ
26. శ్రీ కృష్ణయ్య స్వామి దివ్య చరిత్ర